www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 16 ఆగస్టు 2025





మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

జిల్లాలో రూ.1,030 కోట్లతో 52,735 ఇళ్ల నిర్మాణం పూర్తి...

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి సత్య కుమార్ యాదవ్
- రూ.498 కోట్ల విలువైన ఆస్తుల పంపిణీ
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- వ్యవసాయ శాఖ శకటానికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో రూ.1,030 కోట్లతో 52,735 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని ప్రగతి పథంలో జిల్లాను నడిపించేందుకు కృషి చేస్తున్నామని, ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. జిల్లా డిటిసి పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో మంత్రి జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా, రాష్ట్ర ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రూ. 498 కోట్ల విలువైన ఆస్తులను మంత్రి ఈ సందర్భంగా పంపిణీ చేశారు. అభివృద్ధి పథకాలపై ప్రదర్శించిన వివిధ శకటాలలో వ్యవసాయ శాఖ శకటానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

జిల్లాలో రూ.1,030 కోట్లు ఖర్చుతో ఇప్పటి వరకు రాష్ట్రం లోనే అత్యధికంగా 52,735 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఎన్టిఆర్ భరోసా పెన్షన్ పథకం కింద మందికి రూ.556 కోట్లు పెన్షన్ అందించామన్నారు. డిజిటల్ నెర్వ్ సెంటర్ ను కుప్పం లో పైలట్ ప్రాజెక్ట్ గా జూలై 23న ముఖ్యమంత్రిచే ప్రారంభించుకున్నామని, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పంలో ప్రారంభించుకున్న ఈ సెంటర్ ద్వారా కుప్పంలోని 13 వైద్య ఆరోగ్య కేంద్రాలు అనుసంధానం చేశామన్నారు. డాక్టరు ఎన్ టి ఆర్ వైద్యసేవ పథకం కింద జిల్లాలో ఏప్రిల్ 2025 నుండి ఇప్పటి వరకు 47,725 మందికి రూ.91 కోట్లు, ఆరోగ్య ఆసరా ద్వారా 15,711 మందికి రూ.7.80 కోట్లు ఖర్చు చేశామన్నారు. మెగా డిఎస్సి ద్వారా త్వరలో జిల్లాలో 1,473 పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. తల్లికి వందనం ద్వారా జిల్లాలోని 2,23,201 మంది విద్యార్థులకు సంబంధించి రూ.335 కోట్లు జమ చేశామన్నారు. ఇలా అన్ని పథకాలకు నిధులు ఖర్చుచేసి జిల్లాను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పి మణికంఠ చందోలు, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, జేసి జి విద్యాధరి, జిడి నెల్లూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ విఎం థామస్, చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్ మోహన్, చూడా ఛైర్మన్ కఠారి హేమలత, నగర మేయర్ అముద, కడా పీడీ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడాల్, డిఆర్ఓ మోహన్ కుమార్, చిత్తూరు, కుప్పం ఆర్డిఓలు శ్రీనివాస్, శ్రీనివాస రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పతాక ఆవిష్కరణ తరువాత ముఖ్య అతిథి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్, ఎస్పి లతో కలసి పెరేడ్ ను పరిశీలించారు. అనంతరం వివిధ విభాగాల పోలీసులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్సి సి ల కవాతు నిర్వహించారు. అనంతరం జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా సాధించిన ప్రగతిపై మంత్రి ప్రసంగించారు. వేడుకలో భాగంగా అగ్నిమాపక, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, అటవీ, విద్యా శాఖల శకటాల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు సిఆర్ రాజన్‌ను సత్కరించారు. ప్రభుత్వ విధులలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

రూ.498 కోట్ల విలువైన ఆస్తుల పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈ 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా డిటిసి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా లబ్ధిదారులకు రూ.498 కోట్ల విలువైన ఆస్తులు పంపిణీ చేశారు. డిఆర్‌డిఏ ద్వారా బ్యాంక్ లింకేజీ కింద 20,493 మంది ఎస్‌హెచ్‌జీ లకు రూ. 286 కోట్లు, స్త్రీ నిధి కింద 12,998 మందికి రూ.101.50 కోట్లు మెగా చెక్కు అందించారు. మెప్మా ద్వారా బ్యాంక్ లింకేజీ కింద 7,320 మంది ఎస్ హెచ్ జీ లకు రూ.103 కోట్ల మెగా చెక్కు పంపిణీ చేశారు. ఉద్యాన, ఏపి ఎం ఐ పి ద్వారా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద 795 మంది వ్యవసాయ రైతులకు రూ.8 కోట్లు విలువైన ఉపకరణాలు పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ద్వారా 40 మంది లబ్ధిదారులకు రూ.1.90 లక్షలతో ఉపకరణాలు పంపిణీ చేశారు. జిల్లా గిరిజన శాఖ ద్వారా 22 మందికి 20 ఎకరాలకు సంబంధించి పట్టదారు పాస్ బుక్ పంపిణీ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చిత్తూరు అర్బన్: స్వతంత్ర దినోత్సవ వేడుకలో భాగంగా శుక్రవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా విజయం డిగ్రీ కాలేజీ, చిత్తూరు విద్యార్థులు ప్రదర్శించిన 'ఆయోరే శుభ్ దిన్ ఆయోరే..'పాటకు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, చిత్తూరు విద్యార్థులు 'సైసైసై సయ్యారే మూడు రంగుల జెండా..' పాటకు, రెయిన్ బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల, చిత్తూరు విద్యార్థులు ప్రదర్శించిన 'సునో గోరు సే దునియా వాలా..' పాటకు, ఏ పి ట్రైబల్ వెల్ఫర్ రెసిడెన్షియల్ పాఠశాల, చిత్తూరు విద్యార్థుల 'ఆది వాసి.. 'సంస్కృతి గీతం జానపద పాటకు, లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం ఎయిడెడ్ పాఠశాల, చిత్తూరు విద్యార్థుల 'వందేమాతరం – సుజలాం సుఫలాం...' పాటకు, కాంఫోర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల (నార్త్), చిత్తూరు విద్యార్థులు 'పుణ్యభూమి నా దేశం నమో నమామి' పాటకు నృత్యం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రదర్శన చూపిన విజయం విద్యా సంస్థలు, చిత్తూరు విద్యార్థులకు మొదటి బహుమతి, ఏపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, చిత్తూరు విద్యార్థులకు రెండవ బహుమతి ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించారు.

వ్యవసాయ శాఖ శకటానికి ప్రథమ బహుమతి

చిత్తూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో శకటాల ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా మొదట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ద్వారా మిస్ట్ బుల్లెట్, మిస్ట్ జీపు, ఐ ఆర్ బి బోట్, రెస్క్యూ టెండర్ వాహన శకటాలు ప్రదర్శించారు. తదుపరి వ్యవసాయ శాఖ ద్వారా ప్రకృతి, సమీకృత వ్యవసాయ శకటం, వైద్య ఆరోగ్య శాఖ వారి డిజిటల్ నెర్వ్ సెంటర్, 104, తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్, 108, ఐసిటిసి శకటాలు, అటవీ శాఖ శకటం, తల్లికివందనం, సర్వేపల్లి రాధకృష్ణన్ విద్యార్థి మిత్ర, మెగా పిటిఎంపై అవగాహన కల్పిస్తూ విద్యా శాఖ శకటాలు ప్రదర్శించారు. శకటాల ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనపరచిన వ్యవసాయ శాఖ శకటానికి మొదటి బహుమతి, విద్యా శాఖ శకటానికి రెండవ బహుమతి ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించారు.



అవార్డు స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖాధికారి



ప్రశంసలు స్వీకరిస్తున్న డిఎస్‌పి



మహిళలకు స్త్రీ నిధి చెక్కులు అందిస్తున్న మంత్రి



స్వాతంత్ర్య సమరయోధుడు రాజన్నను సన్మానిస్తున్న దృశ్యం



ప్రథమ బహుమతి పొందిన వ్యవసాయ శాఖ శకటం



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



జిల్లా పౌర సంబంధాల శాఖ ఉద్యోగి తిలక్‌కు ప్రశంస



'స్త్రీ శక్తి' పథకం ప్రారంభం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ లో శుక్రవారం సాయంత్రం స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం బస్సులో మంత్రి, చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రారంభించామన్నారు. ఈపథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 2.6 కోట్లమంది మహిళలు, ఆడపిల్లలు, ట్రాన్స్ జెండర్లకు ఐదు రకాల ఆర్టీసీ బస్ సర్వీసులో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: శ్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి శ్రీధర్ యాదవ్, టిడిపి మండల అధ్యక్షులు స్వామి దాస్, టిడిపి నాయకులు మోహన్ నాయుడు, జయశంకర్ నాయుడు, రుద్రయ్య నాయుడు, అరుణ, కోదండ రెడ్డి, హరీష్ యాదవ్, శిల్ప, జ్యోతి యాదవ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

పలమనేరు: శ్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆయన ఉచిత బస్సు టికెట్లను అందజేసి వారితో కలసి కొంత దూరం ప్రయాణించారు. కార్యక్రమం లో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాల: స్త్రీ శక్తి' పథకాన్ని శుక్రవారం కాణిపాకం అగరంపల్లె ఆర్చి వద్ద రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరు మేయర్ ఆముద, చుడా చైర్మన్ కటారి హేమలత, ప్రజాప్రతినిధులు, అధికారులు పూజలు చేసి ప్రారంభోత్సవం చేశారు.



చిత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విద్యావ్యవస్థను కాపాడుకుందాం: ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రస్తుతం కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని, స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో విద్యా వ్యవస్థను కాపాడుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. చిత్తూరు లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర దినోత్సవ పురస్కరించుకొని నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ మసూద్, మాజీ జిల్లా కన్వీనర్ వినోద్ కుమార్‌లు మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని, స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో విద్యా వ్యవస్థని కాపాడు కోవాలని పిలుపు నిచ్చారు. శాస్త్రీయ విద్య, చరిత్రను విద్యార్థులకు అందకుండా మనుధర్మ శాస్త్రాన్ని తీసుకువస్తూ విద్యార్థులకు చరిత్రను తెలపకుండా చేయడం దుర్మార్గమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు చదువుకు అధిక నిధులు ఇచ్చి కేటాయిస్తుంటే మనదేశంలో రాష్ట్రంలో ప్రతి బడ్జెట్లోనూ, విద్య వ్యవస్థకు బడ్జెట్ కోత పెట్టడం దారుణం అన్నారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యార్థులను చదువుకు దూరం చేయడం సిగ్గుచేటు అన్నారు. స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ పేద మధ్యతరగతి వాళ్లకు విద్య అందకపోవడం దారుణం అన్నారు. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతపేట నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, చాణిక్య, అభినేష్, మాజ్ పాల్గొన్నారు.

పొగాకు ఆరోగ్యానికి హానికరం: ఎంపిపి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పొగాకు ఆరోగ్యానికి హానికరమని ఎంపీపీ అమరావతి అన్నారు. గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో పొగాకు వల్ల కలిగే నష్టాలుపై విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని తుమ్మకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చరిష్మా మొదటి బహుమతి గెలుచుకుంది మంగళపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో రెండవ బహుమతి రకత్, మూడో బహుమతి అఖిల్ గెలుపొందారు. గెలుపు పొందినవారికి ఎంపీపీ అమరావతి చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్ బాబు, ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్‌డివో కార్యాలయంలో గ్రామీణ ఉపాధి హామీ ద్వారా 2014-19 సంవత్సరాల మధ్య నిర్వహించిన మెటీరియల్ వర్క్స్-విత్ హెల్డ్ అమౌంట్ - పేమెంట్స్‌పై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధ్యక్షతన శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో చేసిన అభివృద్ధి పనులకు తమకు బిల్లులు అందలేదని కాంట్రాక్టర్లు, వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఎంబుక్ రికార్డ్స్, ఎస్టిమేషన్స్ లేదనే సాకుతో బిల్లులు చెల్లించక ఇబ్బందులు పెడుతున్నారని అధికారుల దృష్టికి పలువురు తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం 2019కి ముందు పనులు చేపట్టిన వారికి రాజకీయ కక్షతో బిల్లులు చెల్లించక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఇందు కోసం ప్రస్తుత ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసిందని తద్వారా అందరికీ న్యాయం అందుతుందన్నారు. బిల్లులు అందని వారు నిరుత్సాహపడవద్దని త్వరలో మండల స్థాయిలో అధికారులు సమావే శాలు ఏర్పాటు చేసి స్థానికంగా అభివృద్ధి పనులకు సంబం ధించిన రికార్డు లను నమోదు చేసి బిల్లులు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ అడిషనల్ పీడీ మల్లికార్జున, ఏపీడీ రవికుమార్, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, సింగిల్ విండో చైర్మన్లు శ్రీరాములు, నాగరాజు, నారాయణ, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు టిడిపి మండల అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడు, ఆనంద్, నాగరాజు రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శులు గణేష్, చలపతి, ఈశ్వర్లతో పాటు సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, రాంబాబు, రాజన్న, రోజా రెడ్డి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వాల్మీకులను ఎస్‌టిలుగా గుర్తించాలి

ప్రజాశక్తి -పుంగనూరు: వాల్మీకులను ఎస్‌టి రిజర్వేషన్లుగా పునరుద్ధరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వీడాలని ఆ సంఘం నేతలు కుప్పం సురేష్, విశ్రాంతి డిఎస్పి సుకుమార్, బాబులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వాల్మీకి, బోయ కులస్తుల ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి ప్రతినిధుల సమావేశం స్థానిక బిఎంఎస్ క్లబ్ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం చేసి వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించే విషయంపై కేంద్రానికి సిఫార్సు చేశారన్నారు. అయితే ఇప్పటి వరకు కార్యరూపం దాల్చకపోవడంతో రాష్ట్రంలోని వాల్మీకులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు పరిపాలిస్తున్నందున ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్థిక సాంఘిక సామాజిక విద్యాపరంగా వెనుకబడిన వాల్మీకులకు ఎస్‌టి రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీనియర్ వాల్మీకి సంఘ నాయకులు అద్దాల నాగరాజు, న్యాయవాది ఎల్. భాస్కర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, మాడి శంకరప్ప, వి కోట జయచంద్ర, రెంటకుంట్ల నరసింహులు, బొమ్మనపల్లి మునిస్వామి, కొలిమి శ్రీనివాసులు, టైలర్ శ్రీనివాసులు, పెద్ద పంజాణి గంగప్ప, ఏ కొత్తకోట చిన్న, కే రెడ్డప్ప, సోమల శంకరప్ప, శ్రీనివాసులు, వెంకటస్వామి, వెంకటేష్ నేటిగుట్లపల్లి శ్రీనివాసులు, ఈడిగపల్లి నరేష్, బ్యాంకు రాజశేఖర్, రిటైర్డ్ టీచర్ రెడ్డప్ప పాల్గొన్నారు.



జర్నలిస్ట్ గోపీనాథ్‌కు నివాళి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) సభ్యులు, సీనియర్ జర్నలిస్ట్, ఇండియన్స్ డే మాసపత్రిక ఎడిటర్ టి గోపినాథ్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు జిల్లా నాయకులు నివాళులర్పించారు. అనారోగ్యంతో శుక్రవారం ఉదయం గోపీనాథ్ మృతి చెందారు. ఈ క్రమంలో ఎపిడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు నియోజక వర్గ అధ్యక్షులు కేశవులు, నియోజకవర్గ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, నియోజక వర్గం కోశాధికారి నాగరాజు, జిల్లా కోశాధికారి కృపానందరెడ్డి, ప్రచార కార్యదర్శి దినేష్ కుమార్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గందోడి హరిప్రసాద్, సంయుక్త కార్యదర్శులు ఉమాశంకర్, కుబేంద్రన్ తదితరులు శుక్రవారం సాయంత్రం గోపీనాథ్ భౌతికదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఏపీ డబ్ల్యూజేఎఫ్ నాయకులు

నిర్దేశించిన లక్ష్యాలు సాధిద్దాం

డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కేంద్ర సహకార బ్యాంకు ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు సమిష్టిగా కృషి చేస్తున్నట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి తెలిపారు. 79 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బ్యాంకు ఆవరణలో శుక్రవారం త్రివర్ణ పతాకం ఎగురవేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,460 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. అందులో రూ.1,260 కోట్లు డిపాజిట్ల రూపంలోనూ 3,200 కోట్లు వ్యవసాయేత్ర రుణాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో శంకర బాబు, ముఖ్య కార్యనిర్వహణాధికారి మనోహర్ గౌడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి -కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని స్వామి వివేకానంద ప్రైవేటు పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా విద్యార్థులు చేపట్టిన కోలాటం, ఉట్టికొట్టడం వేడుకలు ఎంతో ఆకట్టుకుంది. కృష్ణుని చరిత్ర గురించి చిన్నారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జయమూర్తి, పాఠశాలలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు సహకారంతో ఈషా ఫౌండేషన్ గ్రామీణ క్రీడోత్సవం కార్యక్రమాన్ని యూనివర్సిటీ క్యాంపస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ ఇంచార్జ్ వీసి సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆచార్య అప్పారావు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెరుగుతాయన్నారు. ఈషా ఫౌండేషన్ తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 12 జిల్లాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఓకే గ్రామానికి చెందిన పురుషులకు వాలీబాల్, మహిళలు త్రో బాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈశా ఫౌండేషన్ కోయంబత్తూర్ కోఆర్డినేటర్ స్వామి దక్షరి, వాలంటీర్ బృందం, క్యాంపస్ స్కూల్ హెచ్ఎం షకీనమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు షణ్ముఖం ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి -కార్వేటినగరం: ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వ హించాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం స్కంధపుష్కరిణీ, కుమారగిరిపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని శుక్రవారం డీఎస్పీ సందర్శిం చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆడికృత్తిక వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వ హించు కునేందుకు భక్తులు సహకరించాలని, నిర్వాహకులు భక్తులతో స్నేహ పూర్వకంగా మెలగాలని సూచించారు. పుష్కరిణీలో స్నానాలు చేసే భక్తులు ప్రమాదకరమైన ప్రాంతాల్లో కాకుండా భక్తులు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే స్నానాలు చేసే విధంగా చూడాలని, తెప్పోత్సవాలు జరిగే సమయంలో భక్తులు దూరం నుంచి తిలకించాలన్నారు. ఉత్సవాలు ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా గట్టి బందో బస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు భక్తులు, స్థానికులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, ఎండోమెంట్ ఈవో కృష్ణనాయక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆడికృత్తిక ఉత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిఎస్‌పి సయ్యద్ మహ్మద్ అజీజ్

పట్టువస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి-ఐరాల: వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నుండి పాకాల మండలం ఊట్ల వారి పల్లి శ్రీ వల్లి దేవయాని సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు, ఆడికృత్తిక సందర్భంగా శ్రీ స్వామివారి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను పూతలపటు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ దంపతులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు వినిల్ దంపతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, దేవస్థానం మాజీ ఛైర్మన్ మణి నాయుడు, ఐరాల జెడ్పీటిసి సుచిత్ర, సూపరింటెండెంటు కోదండపాణి, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది ఎస్ఐ నాగేశ్వరరావు కథ మేరకు... బోయకొండ పుంగనూరు ప్రధాన రహదారిలో కొలింపల్లి కర్ణంవారి పల్లి మీదుగా జెసిబిని తరలిస్తుండగా కరణం వారి పల్లి వద్ద విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో జెసిబిలో ఉన్న సుబ్రహ్మణ్యం రెడ్డి (30) విద్యుత్ షాక్‌కు గురై కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు . రామసముద్రం మండలం టీ గొల్లపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి విద్యుత్ షాక్ తో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు


పలమనేరులో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపిలు

పలమనేరు: పలమనేరు ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. పలమనేరు ఏరియా ఆసుపత్రిని అన్ని రకాల సేవలు అందించే జిల్లా ఆసుపత్రిగా (అప్‌గ్రేడేషన్) అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావులు సంయుక్తంగా పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గార్డెన్, ఆక్సిజన్ ప్లాంట్, టేబుల్స్, చైర్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి లోని పలు వార్డులను పరిశీలించారు. అనంతరం అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొని 11 అంశాలకు ఆమోదం తెలిపారు. ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బ్యాంక్, ట్రామా కేర్ సేవలన్నీ అందేలా ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన అంచనాలు త్వరగా రూపొందించాలని సూచించారు. అనంతరం పలువురు సిబ్బందిని వారు అభినందించి అభినందన పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణా రెడ్డి, డిఎస్‌పి డేగల ప్రభాకర్, బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు అర్వీ బాలాజీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్, చంద్రకళ, వైద్యులు శారదా దేవి, సుబ్రహ్మణ్యం, యుగంధర్, మీనాక్షి లతో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: జై భీమ్ ఫౌండేషన్ విశ్రాంతి ఉద్యోగి గుర్రప్ప ఆధ్వర్యంలో పచ్చికాపల్లం మాంబేడు పంచాయితీలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, జైభీమ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


తవణంపల్లిలో

తవణంపల్లి: తవణంపల్లి తహశీల్దారు కార్యా లయంలో తహశీల్దారు సుధాకర్ ఆధ్వర్యంలో, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో హరిప్రసాద్, ఎంపీపీ పట్నం ప్రతాపరెడ్డి, వైస్ ఎంపీపీ అనసూయమ్మ ఆధ్వర్యంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రియాంక వైద్యాధికారులు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

ఉత్తమ సేవలకు ప్రశంస

వెదురుకుప్పం: స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ చేతుల మీదుగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు సమక్షంలో కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఆయనకు పలువురు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గంగాధరనెల్లూరు: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ లక్ష్మీ ప్రియ, ఏవో లోకేష్ , తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు శ్రీనివాసులు, ఎంఆర్‌సి కేంద్రంలో ఎంఈవోలు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి, మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో ఏఈలు వరదరాజులు, తనిగవేలు, తూగుండ్రం జెడ్పీ హైస్కూల్లో విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్, హెచ్ఎం రాజేంద్ర నాయుడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జీడి నెల్లూరు ఆర్‌టిఐ ఏఎస్ సంస్థ కార్యాలయంలో ఆర్‌టిఐ ఏఎస్ సంస్థ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభి రెడ్డి, ఏఎస్ఐ లక్ష్మి , గంగాధర నెల్లూరు సింగిల్ విండో కార్యాలయంలో సింగిల్ విండో చైర్మన్ మోహన్ నాయుడు, సింగిల్ విండో సీఈవో విజయకుమార్ రెడ్డి, సింగిల్ విండో కమిటీ మెంబర్లు జ్యోతి యాదవ్, చిన్న సింగల్ విండో కార్యాలయ సిబ్బంది మునస్వామి జాతీయజెండా ఎగరవేశారు.


వి కోటలో

వి కోట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎంపీపీ యువరాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేట్ కళాశాలలో జాతీయ పతాకం ఆవిష్కరించారు.


విజయపురంలో

విజయపురం: విజయ పురం మండలం మహా రాజ పురంలో స్కూల్ విద్యార్థులకు దాత మణిరాజు ఆధ్వర్యంలో నోటు బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, బ్యాగులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు.

ఏఈ నీరజకు ఉత్తమ అవార్డు

ఐరాల: ఆగస్టు 15 పురస్కరించుకొని ఐరాల మండలం ట్రాన్స్‌కో ఏఈ నీరజ వంద శాతం రెవెన్యూ వసూళ్లను సాధించినందుకు ట్రాన్స్‌కో సీఎండి సంతోషరావు చేతుల మీదుగా ఉత్తమ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు సహకరించిన తమ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న ఐరాల మండల ట్రాన్స్‌కో ఏఈ నీరజ

ఐరాల: మండలంలోని కాణిపాకం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్ గిరిధర్ బాబు, ఐరాల జెడ్పిటిసి సుచిత్ర నాయుడు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, కాణిపాకం మాజీ ఆలయ ఛైర్మన్ మణి నాయుడు, మాజీ జెడ్పిటిసి లత బాబునాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు, నాయకులు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


ఐరాల వినాయక స్వామి ఆలయం ఈవో ఆధ్వర్యంలో

ఐరాల: వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో ఈవో పెంచల కిషోర్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆలయ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో సాగర్ బాబు, ఏఈఓ లు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, సిఎస్ఓ నాగేశ్వరరావు, సూపరింటెండ్లు వాసు, కోదండపాణి, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.


శాంతిపురం జెడ్‌పిటిసి ఆధ్వర్యంలో

శాంతిపురం: మండల కార్యాలయ ఆవరణలో జెడ్‌పిటిసి శ్రీనివాసులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అధికారులు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల త్యాగాల వల్ల మనకు స్వాతంత్రం లభించిందని, పిల్లలిద్దరూ బాగా చదివి దేశానికి సమాజానికి సేవ చేయాలని విద్యార్థులకు తెలిపారు. రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్లో ఎస్ఐ నరేష్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ఉషారాణి, శాంతిపురం ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచులు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. శాంతిపురం సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ గోపాల్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కుమార్, తహశీల్దార్ శివయ్య, ఈవోపిఆర్డి రవినాయక్, అశ్వత్ నారాయణ, స్వాతి జయప్పహరిష్, శివశంకర్ వనిత, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సంజీవరాయుడుకు అవార్డు


అవార్డు అందుకుంటున్న సంజీవరాయుడు

శాంతిపురం: మండల ప్రజా పరిషత్ జూనియర్ అసిస్టెంట్ హెడ్ సంజీవరాయుడు ఉత్తమ ఉద్యోగి అవార్డును జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సత్య కుమార్ చేతుల మీదుగా అందించారు. శాంతిపురం మండలంలో జూనియర్ అసిస్టెంట్ గా విధుల్లో చేరినప్పటి నుండి తన విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ అజాతశత్రువుగా పేరు పొందడం గర్వకారణంగా ఉందని మండలంలోని వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అధ్యక్షులు వసుంధర కోదండ రెడ్డి, ఎంపీడీవో కుమార్, పలువురు అధికారులు అన్నారు. ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

వి కోట : మండల కేంద్రమైన వి కోట లోని రాగళీ దివ్యాంగుల పాఠశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకులు, ఆమ్నెస్ట్ వ్యవస్థాపకులు దశరథ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ రఘుపతి తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐకు అవార్డు



బంగారుపాళ్యం: విధులు పట్ల అంకిత భావంతో పనిచేసినందుకు అవార్డు వరించిందని సీఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని చిత్తూరు పోలీస్ మైదానంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ కలెక్టర్ సుమిత్ కుమార్ ఎస్పీ మణికంఠ చందోల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పోలీస్ స్టేషన్లో విధులు చేపడుతున్న కానిస్టేబుల్ సుధాకర్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎస్ఆర్ పురం : మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర చిప్ గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ , ఎంపీడీవో మోహన మురళి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లోకనాథ పిళ్లై , ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుమన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో లలిత ఏపిఎం రోజా అరుణాచలం రెడ్డి సబర్మతి ఉపాధి హామీ సిబ్బంది రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, టిడిపి మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ సుమన్‌కు ఉత్తమ అవార్డు



ఎస్ ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలం లోని ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుమన్ అందించిన ఉత్తమ సేవలకు ఉత్తమ అవార్డు లభించింది. రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్య కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

రామకుప్పం: మండలంలో 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మండల కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాతంత్ర సమర యోధుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ఎంపిపి సులోచన గుర్రప్ప, వైస్ ఎంపిపి వెంకట్రామ గౌడు, సీతాపతి, రామ్మూర్తి, చిన్ని కృష్ణ, చలపతి, కృష్ణ నాయక్, రామకృష్ణప్ప, సలాం సాబ్ ,విశ్వనాథ్, విజయ్ రెడ్డి, సుబ్రీ, చంద్రారెడ్డి, వెంకటరమణ, అల్లి శీన,బాలు, ఆదిల్, జ్ఞానశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవో రాజేంద్ర బాలాజీకి అవార్డు

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో రాజేంద్ర బాలాజీకి తమ ఉద్యోగరీత్యా వారు చేసిన సేవలు దృష్టిలో ఉన్నతాధికారులు గుర్తించి ఆయనకి ఉత్తమ సేవ పురస్కారాన్ని అందించారుస్వతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా స్థాయిలో వై సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా కలెక్టర్ ఆధ్వర్యంలో సేవా పురస్కారాన్ని అందించారు. ఆయనకు మండల ప్రభుత్వ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యదర్శి సిబ్బంది అభినందించారు.



యాదమరి: యాదమరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చిత్ర నాయుడు మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వేణు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పార్థసారధి, పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐ ఈశ్వర్, విద్యాశాఖ కార్యాలయం నందు ఎంఈఓ లు రుక్మిణి,ప్రసాద్, వైద్యశాల నందు డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, గ్రామ సచివాలయంలో సర్పంచులు, కార్యదర్శులు నువ్వన్న జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సంధ్యారాణి, పిఎసిఎస్ సీఈఓ గుణశేఖర్, కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మండలంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ కార్యాలయాల నందు జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. అన్ని సచివాలయాలలో గ్రామ సభలను నిర్వహించారు. విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు.

కార్వేటినగరం: ఎంపీడీవో కార్యాలయం, మండల తహశీల్దార్ కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయంలో కార్వేటినగం పంచాయతీ కార్యాలయం ఎంఈవోలు విద్యాశిక్షణా సంస్థ (డైట్), పోలీస్ స్టేషన్, శ్రీలక్ష్మీ నరసింహా కళాశాల, ప్రభుత్వ డిగ్రీకళాశాల వద్ద ఎంపిపి లతబాలాజీ, మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ, డిప్యూటీ ఎంపీడీవో మధుసూధన్, విజయకుమార్, మనోజ్‌మార్, ఈవో నాగరత్నమ్మ ఆధ్వర్యంలో మువన్నెల జెండాని ఆవిష్కరించారు.

ఎస్ఆర్ పురం : మండలంలోని వివిపురం గ్రామపంచాయతీ గంగమ్మ గుడి లో వెలసిన శ్రీ ఆరిమాని గంగమ్మ దేవాలయం పరిధిలో స్వతంత్ర దినోత్సవం సందర్భంగా టిడిపి యువ నాయకుడు పైనేని మురళి భక్తులకు అన్నదాన నిర్వహించారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

విజయపురం (నగరి) :మునిసిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ పీజీ నీలమేఘం జెండా ఎగురవేసి ఉత్తమ సేవలు అందించిన వారికి సర్టిఫికేట్లు అందించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ సి. జానకి సి. జానకి జెండా ఎగురవేయగా లాయర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ వద్ద డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్, సీఐ విక్రమ్ జెండా ఎగురవేశారు.

ముగ్గురు రెవెన్యూ అధికారులకు ప్రశంస



ప్రజాశక్తి-సోమల: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సదుం మండలంలోని రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కే లక్ష్మీ నరసయ్య జూనియర్ అసిస్టెంట్, బావా జాన్ బూరగమంద వీఆర్వో, జ్యోతి కంభం వారి పల్లి విఆర్ఓలకు పలమనేరు ఆర్డీవో భవాని చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందించారు.

నాయుని చంద్రశేఖర్ మూర్తికి ఉత్తమ అవార్డు



ప్రజాశక్తి-చౌడేపల్లి: మండల కేంద్రమైన చౌడేపల్లికి చెందిన విజయ వాణి సంస్థల అధినేత నాయిని చంద్రశేఖర్ మూర్తికి ఉత్తమ ప్రశంస అవార్డుతో పాటు జ్ఞాపికను అందజేశారు. వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో ఆయన ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం చిత్తూరులో కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను అందుకున్నారు. సమాజ సేవలో ఆయన చేస్తున్న కృషిని పలువురు కొనియాడారు.





ఉత్తమ సేవలకు సత్కారం

ప్రజాశక్తి -కార్వేటినగరం: విధి నిర్వాహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తమ సత్కారాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్న చంద్రబాబు మాట్లాడుతూ ఉత్తమ అవార్డుతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. తాను అందుకున్న ఉత్తమ అవార్డులో కింద స్థాయి అధికారుల చేయూత ఎంతో ఉందని గుర్తు చేసుకున్నారు. అలాగే విద్యుత్ ఏడీఈ చంద్రబాబు కూడా ఉత్తమ అవార్డును అందుకున్నారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ కార్యదర్శిగా సేవలు అందించిన చరణ్ సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. కార్వేటినగరం జూనియర్ లైన్మాన్గా విధులు నిర్వహిస్తున్న దినేష్ ఉత్తమ జేఎల్ఎంగా అవార్డును అందుకున్నారు.



విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యాదమరి: కే గొల్లపల్లి పాఠశాలలో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ లలిత పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం పాఠశాలలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. పాఠశాల వైస్ చైర్మన్ అమని,హెచ్.యం, ప్రిన్సిపాల్ ఎపిలలిత, కమిటీ సభ్యులు వెంకటేష్, పురుషోత్తం, ధనంజయ, సర్పంచ్ రాధమ్మ, ఉపాధ్యాయ సంఘ నాయకులు కనకాచారి, మదన్ మోహన్ రెడ్డి, మధు సూదన్ పాల్గొన్నారు. మార్చి పదవ తరగతి పరీక్షలలో 500 మార్కులు పై వచ్చిన ఏడుగురు విద్యార్థులకు ప్రిన్సిపాల్ లలిత 10వేల రూపాయలు నగదు బహుమతులు అందించారు. మండలంలోని వరిగపల్లె ,వరదరాజులపల్లె, పెరుమాళ్ల పెంట, కోడి గుట్ట, పుల్లయ్యగారిపల్లెకోటాల, యాదమరి పాఠశాలలోస్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు నిర్వహించారు.

పుంగనూరు: ప్రభుత్వ, ప్రైవేటు, కార్యాలయాలు లో వివరణ పతాక రిజర్వేషన్ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులు, అగ్నిమాపక శాఖ కార్యాలయంలో శాఖ అధికారి సుబ్బరాజు, స్థానిక ప్రైవేటు బస్టాండ్ లో ఆజాద్ ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో భారతదేశ చిత్రపటానికి ప్రత్యేకంగా ప్రదర్శించారు.

చిత్తూరు అర్బన్ : బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ కుమారి , పాఠశాల డైరెక్టర్ ప్రియాతేజ అకాడమిక్ రూప రాణి , వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత ఆధ్వర్యంలో పూజా కార్యక్రమంతో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథి అకాడమిక్ డీన్ రూప రాణి హాజరయ్యారు. ప్రశంస పతకాలను డీన్ ప్రియా ప్రదానం చేశారు.

స్త్రీ శక్తి పథకం ప్రారంభం

ప్రజాశక్తి - రొంపిచర్ల: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం పుంగనూరు టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ నుండి స్వయంగా బస్సును డ్రైవింగ్ చేసి ఉచిత బస్ ను ప్రారంభించారు. ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

సహకార పరపతి సంఘం చైర్మన్ శివ శంకర్

ప్రజాశక్తి -సోమల: సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వం నుండి ప్రజలకు అవసరమైన సమాచారాన్ని పొందే విధానాన్ని, దీనివల్ల కలిగే లాభాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సోమల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ శివ శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సోమల లోని సహకార సంఘం కార్యాలయంలో డి సి ఓ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టంపై రైతులకు సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప విభాగ సహకార అధికారి ఆనందం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలనుండి ప్రజలకు అందే సేవలకు సంబంధించి ప్రజలు కూడా పూర్తి సమాచారాన్ని తెలుసుకునే హక్కు సద్వినియోగం చేసుకోవడమేనని తద్వారా ప్రజలకు న్యాయమైన చట్టబద్ధమైన సేవలు అందజేసే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ మెంబర్లు సతీష్, అష్రఫ్ అలీ, మార్కెట్ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు, సంఘ సభ్యులు పీఎం మల్లికార్జున, మహేంద్ర బాబు, చాణక్య, సీఈఓ రెడ్డప్ప కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

చెరువులు కబ్జా

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలో పలు చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. క్రమంగా ఆక్రమించి పంటలు సాగుచేస్తుండడంతో రైతులకు నీళ్లు అందించే చెరువుల విస్తీర్ణం తగ్గిపోయి తటాకాలు కనుమరుగయ్యే దుస్థితి ఏర్పడి వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. వీటిని పరిరక్షిం చాల్సిన రెవెన్యూ అధికారులు నిద్రావస్థలో వుండడంతో చెరువుల కబ్జాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో రైతు లు అయోమయానికి గురై ఆందోళనకు గురవుతున్నారు.

చెరువుల కబ్జా

బైరెడ్డిపల్లి మండలంలో అనేక చెరువులు క్రమక్రమంగా కబ్జాలకు గురి అవుతున్నాయి. బైరెడ్డిపల్లి మండలంలోని పెద్ద చెరువు, కడపనత్తం చెరువు, లక్కనపల్లి చెరువు, మేకల నాగిరెడ్డిపల్లి చెరువు, ఇలా పలు చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. బైరెడ్డిపల్లి పెద్ద చెరువు కమ్మనపల్లి పంచాయతీ భాగానికి 75 ఎకరాలు, గంగినాయన పల్లి పంచాయతీ భాగానికి 70 ఎకరాలు, బైరెడ్డిపల్లి పంచాయతీ భాగానికి 62 ఎకరాలు మొత్తం సుమారు 207 ఎకరాల పైచిలుకు గుండుబావిలా నిండుగా నీటితో కళకళ లాడాల్సిన ఈ చెరువు కాస్త విస్తీర్ణంగా బాగా తగ్గిపోయి కనుమరుగయ్యే దుస్థితికి చేరింది.


రైతుల అయోమయం

పూర్వం చెరువులను సహజ వనరుగా భావించి పెద్ద తటాకాలుగా తవ్వించి చెరువుల నిర్మాణాలు చేపట్టారు. చెరువులో ఎంత నీరు నిలువ ఉంటే భూమి అంత సారవంతంగానూ నీటి శాతం ఎక్కువగానూ ఉంటుంది. అయితే ఇప్పటి పరిస్థితుల్లో నీరు ఇంకడం లేదు. నీరు భూమిలోకి ఇంకకపోతే బోర్లలో నీరు ఉండదు. రాయలసీమ వంటి వర్షాభావ ప్రాంతంలో బావులు, చెరువులు, బోర్లపైనే ఎక్కువగా రైతులు ఆధారపడి పంటలు పండిస్తుంటారు. చెరువులలో నీళ్ల నిలువ ఉండడం ఎంతైనా అవసరం. చెరువులను ఆక్రమించి మట్టిని ఎత్తుగాతోసి చదును చేసి పంటలను పండించుకోవడం వల్ల వర్షాలు పడి నీరు నిలవాల్సిన సమయం వచ్చినప్పుడు ఆ నీరు కాస్త పల్లానికి వెళుతోంది. గత సంవత్సరం మండలంలో విరివిగా వర్షాలు పడి చెరువులు నిండిపోయి మరవలు వెళ్లాయి. గతంలో ఒకసారి చెరువు నిండితే కొన్ని సంవత్సరాల పాటు ఆ చెరువుపై ఆధారపడి బావులన్నీ నిండుగా ఉండేవి. రైతులు పంటలు పండించు కునేవారు. ఇప్పుడు చెరువులు నిండినా సంవత్సరం లోపే ఇంకిపోతున్నాయి. చెరువులోని ఇసుకను తరలించ డం, మట్టిని తవ్వేయడం దీనికి ప్రధాన కారణంగా వుంది. చెరువులు కబ్జాలు చేసి ఆ చెరువుపై మట్టిని తోలి పంటలు పండించుకోవడమే రెండవ కారణమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులలో షెడ్లులు వేసుకొని విద్యుత్ ట్రాన్సుఫార్మర్లు బిగించు కుని బోర్లు వేసుకొని పంటలను యథేచ్ఛగా పండిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించాలి.



పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి -సోమల: శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాలలో భాగంగా శుక్రవారం పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను శుక్రవారం సమర్పించారు. ప్రతి ఏడాది స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని ఈ క్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య స్వర్ణలత పట్టు వస్త్రాలు తీసుకురాగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలు సమర్పించి మూల విరాటును దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భార్యాభర్త ఒకే పోలీస్ స్టేషన్లో విధులు

బైరెడ్డిపల్లిలో అరుదైన ఘటన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రభుత్వ ఉద్యోగాలలో భార్యాభర్తలు ఒకే కార్యాలయంలో విధులు నిర్వర్తించడం అరుదుగా జరిగే విషయం. అలాంటి ఒక ప్రత్యేక సందర్భం ప్రస్తుతం బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్లో చోటు చేసుకుంది. ఈ స్టేషన్లో భార్యాభర్తలు ఇద్దరూ కానిస్టేబుళ్లగా విధులు నిర్వర్తిస్తున్నారు. భార్య కె. నిరోషా 2018 బ్యాచ్‌లో పోలీస్ శాఖలో చేరగా, భర్త కె. సుబ్రమణ్యం 2013 బ్యాచ్‌లో చేరారు. పోలీస్ సేవల్లో వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తూ ఇప్పటివరకుఇద్దరూ వేరు వేరు చోట్ల విధులు నిర్వహించారు.జిల్లా ఉన్నతాధికారులు, ముఖ్యంగా ఎస్పీ కార్యాలయం, వీరిద్దరినీ కుటుంబ సమగ్రత, వ్యక్తిగత సౌలభ్యం దృష్ట్యా ఒకే స్టేషన్లో విధులు చేసేలా బదిలీలు అమలు చేశారు. దీని వలన కుటుంబ సభ్యుల మధ్య సమయాన్ని పంచుకోవడం, పిల్లల సంరక్షణ, గృహ వ్యవహారాలు సులభమయ్యాయని ఈ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని హర్షించారు. "కుటుంబం దగ్గరగా ఉంటే మానసిక ఉల్లాసం పెరిగి, పనితీరు మరింత మెరుగవుతుంది" అని పలువురు అభిప్రాయపడ్డారు. బైరెడ్డిపల్లి స్టేషన్‌లో ప్రస్తుతం వీరి సేవలతో పనితీరు మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని సహచర సిబ్బంది అంటున్నారు. ఈ జంట సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు భావిస్తున్నారు.

దుస్థితిలో పశు వైద్యశాల

- శిథిలావస్థలో కూలేందుకు సిద్ధం
- బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



ప్రజాశక్తి- శాంతిపురం : మండల కేంద్రంలోని పశువైద్యశాల దుస్థితికి చేరుకుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం వర్షాలకు ఉరుస్తూ కూలేందుకు సిద్ధంగా వుంది. వైద్యం కోసం వచ్చే పశువులకు సరైన సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులకు వైద్యం అందించడానికి ఏర్పాటుచేసిన షెడ్డు పైకప్పు రేకులన్నీ పగిలిపోయి ఇబ్బందికరంగా మారాయి. దీంతో వైద్యం కోసం వచ్చే పశువులు ఎండకి ఎండుతూ, వానకు తడుస్తూ వైద్యం అందించాల్సి వస్తోంది. ఏ ఆసుపత్రి భవనానికి వున్న గోడలన్నీ బీటలు వారి ఎప్పుడు కూలిపోతుందో అన్న భయంతో ఈ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో పశువుల కోసం ఏర్పాటుచేసిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి పశువైద్యశాలకు మరమ్మతులు చేసి పాడి రైతులకు అందుబాటులోకి తీసుకురావాల్సి వుంది.


పశువైద్యశాలలో నిరుయోగంగా వున్న నీటి తొట్టెలు